క్లుప్తంగా

పెద్ద శివాలయం హుండీ కానుకల ఆదాయం రూ.4.41 లక్షలు

గుడివాడటౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం(పెద్దశివాలయం) హుండీ కానుకల లెక్కింపు బుధవారం జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఇతర దేవాలయాల కార్యనిర్వహణాధికారుల సమక్షంలో జరిపిన లెక్కింపులో మొత్తం రూ.4 లక్షల 41 వేల 537 రొక్కం, 2 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 135 గ్రాముల వెండి వచ్చిందని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాలస్వామి దేవస్థానం ఈఓ వై.శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాంబాబు పాల్గొన్నారు.

ప్రజలకు జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీరామనవమి శుభాకాంక్షలు

గుడ్లవల్లేరు: ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్లుగా అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలంతా సుఖ శాంతులు, సిరి సంపదలతో ఉండాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములై తమ తమ జీవితాల్లో సుభిక్షంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

గుడివాడటౌన్(నందివాడ): పదవ తరగతి పరీక్షల దృష్ట్యా నందివాడ మండలంలోని నందివాడ, వెన్ననపూడి, రుద్రపాక, జిల్లా పరిషత్ పాఠశాలల పరీక్ష కేంద్రాల వద్ద ఏప్రిల్ 3వ తేదీ నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని నందివాడ తహసీల్దార్ భావన్నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిధిలోని 200 మీటర్ల దూరంలో గుంపులు గుంపులుగా ఉండటం కాని, ఇతర సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించరాదని, ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

పామర్రు: పోషణ్ పక్వాడ కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో వి.భానుశ్రీ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, నిత్యం మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ కుమారి పాల్గొన్నారు. కురుమద్దాలి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లల తల్లులకు పౌష్టికాహారం గురించి, చిరు ధాన్యాల గురించి, ఆరోగ్య పరిరక్షణ గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. సర్పంచ్ జి.విజయభారతి, సూపర్‌వైజర్ వై.పుణ్యవతి పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన అందరికీ ఆదర్శం

ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ



ఆటపాకలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణను సన్మానిస్తున్న ప్రజలు

కైకలూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న పాలన ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా మారిందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ అన్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా విజయం సాధించిన జయమంగళ వెంకట రమణను బుధవారం ఆటపాకలోని ఆయన నివాసం వద్ద నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు, వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో కొల్లేరు ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఎమ్మెల్సీ కేటాయించి, తన పక్కన కూర్చోబెట్టుకుంటానని వాగ్దానం చేశారని, చెప్పిన ప్రకారం తనకు ఎమ్మెల్సీ ఇచ్చారన్నారు. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణంతో పాటు కొల్లేరు రీ–సర్వే ద్వారా మిగులు భూములను పేద ప్రజలకు పంపిణీ చేయాలని సీఎంను కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సయ్యపురాజు గుర్రాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణం చూతము రారండి!

- సీతారాముల కల్యాణానికి ముస్తాబైన రామాలయాలు
- నేడు తాడినాడలో మధ్యాహ్నం 12 గంటలకు స్వామి కల్యాణం
- అపర భద్రాద్రి మోటూరులో ముమ్మర ఏర్పాట్లు



నవమి ఉత్సవాలకు ముస్తాబైన పామర్రులోని విష్ణాలయం



తాడినాడ సీతారామస్వామి దేవాలయం వద్ద యాగం చేస్తున్న పురోహితులు



జమీదగ్గుమిల్లిలో పెండ్లి కుమార్తె, కుమారులుగా అలంకరించిన సీతారామచంద్రస్వాములు



సింగరాయపాలెం బావాజీ మఠంలో కల్యాణానికి ముస్తాబైన కోదండరామాలయం



మోటూరు శ్రీసీతారాముల స్వామివారి ఆలయ ముఖద్వారం

పామర్రు: మండలంలోని అన్ని రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సర్వాంగ సుందరంగా రంగులతో తీర్చి దిద్దుతున్నారు. పామర్రులోని విష్ణాలయం, తోట రామాలయం, గొడ రామాలయం, వెలమ రామాలయం, కోటిరెడ్డి పేట, చౌదరి పేట, అరండల్ పేట, రాపర్ల, జమీదగ్గుమిల్లి, ఉండ్రపూడి, పోలవరం, కనుమూరు, కురుమద్దాలి, ఉరుటూరు తదితర గ్రామాల్లోని ఆలయాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరిస్తూ దేవాలయాలను ముస్తాబు చేస్తున్నారు. నవమికి వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తాడినాడలో...

కై కలూరు: శ్రీరామనవమి వేడుకలకు రామాలయాలు ముస్తాబయ్యాయి. అపర భద్రాద్రిగా పేరుగడించిన తాడినాడ సీతారామస్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి అధ్యాయన కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి దివ్య కల్యాణాన్ని నిర్వహించనున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరగనుంది. భక్తులకు అన్ని సౌకర్యాలు కలిపించామని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు బుధవారం చెప్పారు. కైకలూరు కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ప్రాంగణంలో శ్యామలా కిరాణా మర్చెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 73వ వార్షిక సీతారామ కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. పునర్వసు నక్షత్రయుక్త అభిజిత్ మిధునలగ్న పుష్కరాంశములో మధ్యాహ్నం 12.22 గంటలకు కల్యాణ ముహుర్తాన్ని పురోహితులు నిర్ణయించారు. కైకలూరు రైల్వే కాలనీ, కాపుల వీధి పురాతన రామాలయం, ముదినేపల్లి మండలం చెన్నూరు రామాలయాల్లో పూజలు, సింగరాయపాలెం బావాజీమఠం, తాడినాడ సీతారామస్వామి దేవాలయాల్లో అన్న సమారాధన కార్యక్రమాలకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) హాజరవుతారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు రామాలయాలు గురువారం జరిగే శ్రీరామనవమి కల్యాణోత్సవాలకు ముస్తాబయ్యాయి. పలు గ్రామాల్లో 3 నుంచి 9 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండరామ స్వామి ఆలయం వద్ద శ్రీరామనవమి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణమంతా చలువ పందిళ్లతో ముస్తాబు చేశారు. ఈ కల్యాణానికి రాష్ట్రంతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి బంజారాలు అధిక సంఖ్యలో హాజరవుతారు. కల్యాణానికి ముందు బంజారాల ఆధ్వర్యంలో 'భోగ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించి కల్యాణతంతు జరిపిస్తారు. కల్యాణానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. చిగురుకోట చినకామనపూడి, వడాలి, పెదగొన్నూరు, చేవూరు, వాడవల్లి, ముదినేపల్లి పెద రామాలయాల్లో కల్యాణాలు, అన్నసమారాధనలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.

శ్రీసీతారామస్వామి కల్యాణానికి ఘనంగా ఏర్పాట్లు

గుడివాడరూరల్: అపర భద్రాద్రిగా పేరుగాంచిన మోటూరు(గోదాపురం) గ్రామంలో ఉన్న శ్రీసీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా 30వ తేదీ గురువారం ఉదయం 12.16 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి సంవత్సరం లాగానే ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది ఇక్కడ నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాలకు జిల్లాతో పాటు పరిసర జిల్లాల నుంచి కూడా భక్తులు వందలాదిగా హాజరవుతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆలయ ఉత్సవ కమిటీతో పాటు, దేవదాయ, ధర్మదాయశాఖ అధికారులు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గుడివాడరూరల్ ఎస్‌ఐ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీరామనవమి పర్వదినాన భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఉండ్రపూడిలో నవమి ఉత్సవాలు ప్రారంభం

పామర్రు: స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి మహోత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏకాహ మండప ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మట్టా పూర్ణచంద్రరావు, కార్యనిర్వహణాధికారి ఎల్.సత్యవతి, మట్టా అనిల్, పూజిత దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలను చేశారు. ఆలయ అర్చకులు ఎ.రామాచార్యులు, బి.ఫణికిషోర్, శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జమీదగ్గుమిల్లిలో సీతారాములను బుధవారం పెండ్లి కుమార్తె, కుమారులుగా అలంకరించి విశేషంగా పూజించారు. తొలుత ఆలయంలో స్వామి వార్లకు అభిషేకాలను పంచామృతాలతో, నవరసాలతో అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గడప గడపలో ప్రజా సమస్యలు పరిష్కారం



ఎస్టీ ఏరియా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పెదపారుపూడి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని సమస్యలకు చాలా వరకు పరిష్కారం దొరుకుతున్నాయని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడిలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఎస్టీ, ఎస్సీ ఏరియాలోని ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము ఎన్నో ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నా ఇళ్ల పట్టాలు మాత్రం ఇవ్వటం లేదని, ఇళ్ల పట్టాలు ఇప్పించాలని ఎస్టీ మహిళలు ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే హౌసింగ్ జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడి ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇరిగేషన్ కాలువ పక్కన ఇచ్చిన జగనన్న లేఅవుట్‌లోకి వెళ్లటానికి తూములు పెట్టి వంతెన వేయించాలని కోరగా, వంతెన సమస్య పరిష్కరించాల్సిందిగా ఎమ్మెల్యే హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావును ఆదేశించారు. గ్రామాల్లో ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే శక్తి వంచన లేకుండా ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, వైస్ ఎంపీపీలు పొనుగుమాటి రజిని, వెలగల పద్మ, మండల సచివాలయ కన్వీనర్ జాజుల చిన్నారి, పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షుడు తుమ్మల కోటేశ్వరరావు, పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్లు చీకుర్తి వరప్రసాద్, గోళ్ళ వెంకటేశ్వరరావు, చేబ్రోలు సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు జాజుల నాగరాజు, నాలి రఘు, వంపుగాని బాలు, పలు గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి సహకరించండి



తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న స్థానికులు

గుడివాడటౌన్: ఫ్లై ఓవర్ నిర్మాణ పనులలో భాగంగా తొలగిస్తున్న రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారుల బడ్డీలు, నివాసం ఉంటున్న గుడిసెల తొలగింపునకు సమయం ఇవ్వాలని ఫ్లై ఓవర్ నిర్మాణ పరిసర ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి విజ్ఞప్తి చేశారు. వారు బుధవారం ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి ఈమేరకు విజ్ఞప్తిచేశారు. ఎంతో కాలంగా రోడ్డును ఆనుకుని చిరువ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, వాటిని తొలగించడం వలన తమ కుటుంబాలు రోడ్డున పడతాయని కొంత సమయం ఇస్తే తామే తొలగించుకుంటామని వారు కోరారు. దీనిపై స్పందించిన నాని మాట్లాడుతూ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టడం ఇప్పటికే ఆలస్యమైందని ఇంకా సమయం ఇవ్వడం సాధ్యపడదన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఉచితంగా స్థలం ఇస్తామని రాతి కట్టడాలు తొలగిస్తే నష్టపరిహారం ఇచ్చేందుకు ఆర్డీఓకు సిఫారసు చేస్తామని లక్షలాది మంది ప్రజల సమస్య కనుక ఫ్లై ఓవర్ నిర్మాణానికి మీరు కూడా సహకరించాలని కోరారు.

చదువుకు పేదరికం ఆటంకం కారాదు



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

గుడివాడటౌన్: ఆర్థిక అసమానతలు చదువుకు ఏ మాత్రం అడ్డు రాకూడదనేదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉద్దేశమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. స్థానిక కమ్మ సత్రంలో బుధవారం ఆర్థికంగా వెనుకబడిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 మంది కమ్మ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకాలు అందజేశామన్నారు. ఇటీవల జగనన్న విదేశీ విద్యాదీవెన పొందిన వారిలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు కూడా అనేకమంది ఉన్నారని, వైఎస్సార్‌సీపీ కమ్మ సామాజిక వర్గానికి వ్యతిరేకం కాదనడానికి ఇది నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గద్దె పుష్పరాణి, కమ్మ సామాజికవర్గ నాయకులు పర్వతనేని ఆనంద్, చాపరాల రాజా, పిన్నమనేని రాఘవేంద్రరావు, పాలడుగు రాంప్రసాద్, గాంధీ, కమ్మ సత్రం మేనేజర్ కావూరి సురేష్ పాల్గొన్నారు.

దినదినాభివృద్ధి చెందుతున్న ఫార్మసీ రంగం

గుడ్లవల్లేరు: ఫార్మసీ రంగం దినదినాభివృద్ధి చెందుతోందని కృష్ణా యూనివర్సిటీ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాంబాబు అన్నారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ 13వ వార్షికోత్సవం పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో కాలేజీ సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణ రావు, కె.వి.కృష్ణారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్రికరణశుద్ధిగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు(డీఎన్నార్) అన్నారు. ఆసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక మార్కెట్‌యార్డు ప్రాంగణంలో బుధవారం మండల వైఎస్సార్ క్రాంతి పథకం ఆధ్వర్యంలో ఆసరా మూడవ విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ పథకం ఏదైనా లబ్ధి మహిళలకే అందజేస్తూ మహిళా పక్షపాత ప్రభుత్వంగా ముందుకెళ్తున్నామన్నారు. సీఎం జగనన్నకు మహిళల ఆశీర్వాదాలు ఎల్లవేళలా ఉండాలని కోరారు. మండలంలో మూడోవిడతగా అందిన రూ.9 కోట్ల 71లక్షల 88వేల 662 నమూనా చెక్కును అక్కచెల్లెమ్మలకు అందజేశారు. అనంతరం మహిళలు కృతజ్ఞతాపూర్వకంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము) అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ పి.మల్లీశ్వరి, జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర బీసీ నాయకులు చేబోయిన వీర్రాజు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బి.యేసోబురాజు, వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణు, పీఏసీఎస్ చైర్మన్ బొమ్మనబోయిన గోకర్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలు మోరు వెంకటరమణ, ఎంపీటీసీలు ఎం.కిరీటిరాజు, పి.లక్ష్మీకాంతం, డి.రమేష్, సర్పంచ్‌లు, స్థానిక ఉప సర్పంచ్ జె.నాగలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు దత్తాడ నరసింహారావు, ఆర్‌బీకే చైర్మన్ జంగం ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకులు జి.తమ్ముస్వామి, పి.సత్యనారాయణ, జె.వీర్రాజు, పి.కొండారెడ్డి, ఎం.మల్లికార్జునరావు, పి.సత్యనారాయణ, ఏపీఎం ఎడ్వర్డ్, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు భోజనం పొట్లాల పంపిణీ

గుడివాడటౌన్: గుడివాడ తారక రామా వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక రైల్వేస్టేషన్, ఫ్లై ఓవర్, బస్టాండ్ ప్రాంతాలలోని పేదలకు భోజన పొట్లాలు పంపిణీ చేశారు.

మాజీ ఎంపీటీసీ వజ్రమ్మ మృతి తీరనిలోటు

పామర్రు: పామర్రు మాజీ ఎంపీటీసీ గడ్డాడ వజ్రమ్మ(68) అనారోగ్యంతో గత కొంత కాలంగా బాధ పడుతూ బుధవారం మృతి చెందారు. గతంలో పామర్రు–4వ సిగ్మెంట్‌కు ఎంపీటీసీగా పని చేసి సేవలు అందజేశారు. మృతురాలి భౌతిక కాయాన్ని స్థానిక శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్ సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. మృతురాలి కుటుంబీకులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. స్థానిక ప్రముఖ దంత వైద్యుడు గడ్డాడ విక్టర్ పాల్ మాతృమూర్తి అయిన వజ్రమ్మ మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రిక్స్ తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

గుడివాడటౌన్: జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాలలో వినియోగించుకునేందుకు తయారు చేస్తున్న సిమెంట్ బ్రిక్స్ నాణ్యత తగ్గకూడదని హౌసింగ్ డీఈఈ రామోజీ నాయక్ అన్నారు. స్థానిక మల్లాయిపాలెం లే–అవుట్‌లో ఇళ్ల నిర్మాణం కోసం సరఫరా చేస్తున్న సబ్సిడీతో కూడిన సిమెంట్ బ్రిక్స్ యూనిట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. బ్రిక్స్ కొలతలు, నాణ్యతా ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే–అవుట్‌లోని 1286 మంది లబ్ధిదారులకు బేస్‌మెంట్ స్థాయి పూర్తయిన ప్రతి ఒక్కరికీ సబ్సిడీతో ఈ బ్రిక్స్ ఇస్తామన్నారు.

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం

తోట్లవల్లూరు: పెరటికోళ్ల పెంపకం లాభదాయకమని, వాటితో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి సూచించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యాన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెరటికోళ్ల యూనిట్ల పంపిణీ బుధవారం జరిగింది. మండల వ్యాప్తంగా 35 మంది లబ్ధిదారులకు 35 యూనిట్లను రాజామణి పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్ కింద రూ.3970 విలువైన కోళ్లు, మేతను అందజేశారు. ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఏసీ ఈడ్పుగంటి రంగారావు, ఏపీఎం కృష్ణంరాజు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

తోట్లవల్లూరు: బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా గత వారం రోజులుగా నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జొన్నల బ్రహ్మానందరెడ్డి తెలియజేశారు. మండలంలోని దేవరపల్లిలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. అనంతరం చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, డాక్టర్ అపర్ణ, డాక్టర్ సువర్ణలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జ్యోతి, డాక్టర్ ఉషారాణి పాల్గొన్నారు.

తృణ ధాన్యాల్లో పోషక విలువలు మెండు

కైకలూరు: కైకలూరు 2, 3 వార్డులకు సంబంధించి ఎంపీయూపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య గర్భిణులు, బాలింతలకు పోషకాహార విలువలపై బుధవారం అవగాహన కలిగించారు. తృణ ధాన్యాలను క్రమం తప్పకుండా వినియోగించడం వల్ల పోషకాలు సమపాళ్లలో లభిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా తృణ ధాన్యాలతో తయారు చేసిన వంటకాల్లో రాగి హల్వా తయారీలో ఎస్‌డీ.ఫర్హానా, మల్టీమిక్స్ పాయసంలో షాహీనా బేగం, బాలామృతం లడ్డూలో ఆర్.దేవీలకు బహుమతులను 3, 4 వార్డు సభ్యులు మహమ్మద్ గాలిబ్‌బాబు, గుడిపాటి విజయశే అందించారు.

సారా విక్రయిస్తున్న తండ్రీ కొడుకులు అరెస్ట్

కైకలూరు: గ్రామాల్లో సారా, అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో (సెబ్) కై కలూరు సీఐ ఎస్.రాంబాబు హెచ్చరించారు. మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామంలో బుధవారం దాడులు నిర్వహించి తండ్రీ కొడుకులు బలే వెంకన్న, బలే మణికంఠ నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించగా, న్యాయమూర్తి వారిరువురికీ 15 రోజులు రిమాండ్ విధించారన్నారు.

జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం



పెదపారుపూడి: జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి పనులు పూర్తి చేసేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఇళ్ల నిర్మాణ పనులపై గుడివాడ ఆర్డీవో పద్మావతితో కలిసి బుధవారం ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. గుడివాడ ఆర్డీవో పద్మావతి గ్రామాల వారీగా ఇళ్ల నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరై నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి ఇళ్ల పట్టాలు తిరిగి వెనక్కు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, వైస్ ఎంపీపీ పొనుగుమాటి రజిని, తహసీల్దార్ వి. నాగభూషణం, ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి, హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



చెక్కును పంపిణీ చేస్తున్న నాయకులు

గుడివాడటౌన్(నందివాడ): మహిళలు ఆర్థికంగా స్థిరపడినప్పుడే రాష్ట్రం, దేశం బాగుపడుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భావించి వారి అభ్యున్నతికి కృషిచేస్తున్నారని నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం అన్నారు. మండల కేంద్రంలోని కొండపల్లి కన్వెన్షన్‌లో బుధవారం మూడవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందివాడ మండలంలోని 790 గ్రూపులలోని 7,853 మంది అక్కచెల్లెమ్మలకు మూడవ విడతలో 6 కోట్ల 78 లక్షల 57 వేల 968 రూపాయలు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా గ్రూపుల ఖాతాలో జమ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కందుల దుర్గా కుమారి, వైస్ ఎంపీపీలు, పూడి సుధాకరరావు, కె.జయరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, గూడపాటి వెంకటేశ్వరరావు, మెరుగుమాల కాశీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.